

హైదరాబాద్ వార్త

హైదరాబాద్,మార్చి 3 ప్రభాతవార్త : సప్తవర్నాల హోలీ సంబురం అంబరాన్నంటింది. వర్ణమయమై..రస రమ్యమయమైంది. మంగళవారం హోలీ వేడుకలతో భాగ్యనగరం తడిసిముద్దయింది. రంగుల తరంగం పరవళ్లుతొక్కింది. చిన్నా పెద్దా తేడా లేకుండా కలర్స్‌లో మునిగితేలారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఈ వేడుకను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించుకున్నారు.ఉస్మానియావర్సిటీ ప్రాంగణంలో హోలీ ఉత్సవాల్లో వందలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆట పాటలతో ఆకట్టుకున్నారు. సిటీలోని గల్లీలన్నీ 'రంగు' రంగ వైభవంగా హోలీ వేడుకలు నిర్వహించారు.

పండగ రోజు విషాదం

-సరదాగా ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల దుర్మరణం

-విశ్వకర్మ కాలనీలో ఘటన

జీడిమెట్ల, మార్చి 3, ప్రభాతవార్త

హోలీ పండుగ రోజు తమ స్నేహితులతో కలిసి సరదాగా స్థానికంగా ఉన్న చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు నీట మునిగి మరణించిన విషాద సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం విశ్వకర్మ కాలనీకి చెందిన సాగర్ (17), కృష్ణానగర్‌కు చెందిన అభిషేక్ (17) వీరిద్దరూ హోలీ పండుగ సందర్భంగా తన స్నేహితులతో కలిసి స్థానికంగా ఉన్న పంతులు చెరువులో ఈతకు వెళ్లారు. సరదాగా చెరువులోకి దిగడంతో నీటిలోతు తెలియక ఇద్దరు యువకులు నీట మునిగారు. మరో ముగ్గురు స్నేహితులు ఒడ్డుకు చేరుకున్నారు. చెరువులో మునిగి మృతి చెందిన యువకులను డిఆర్ఎఫ్ బృందాల సహకారంతో బయటకు తీశా రు. మృతదేహాలు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సూరారం సిఐ సుధీర్ కృష్ణ తమ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సిక్కుల ఊరేగింపు..ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్, మార్చి 3 ప్రభాతవార్త

హోలీ మొహల్లా, సిక్కుల మతపరమైన ఊరే గింపును పురస్కరించుకుని నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉండనున్నాయి. ఈ ఊరేగింపు బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సెంట్రల్ గురుద్వారా నుండి ప్రారం భమై శంకర్‌షేర్ హోటల్,మెహబూబ్‌గంజ్, ఎస్.ఎ.బజార్ మసీదు,బర్తన్ బజార్, స్వస్తి మిర్చి, బేగంబజార్ ఛత్రి, చూడీ బజార్, రాణి అవంతి బాయి విగ్రహం, టక్కర్‌వాడి టిజంక్షన్, గాంధీ విగ్రహం,పురానాపూల్ ఎక్స్ రోడ్, పురా నాపూల్ దర్వాజా మీదుగా కిషన్ బాగ్ గురు ద్వారా,అత్తాపూర్ లోని బరంబాలా గురుద్వారా వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో, పైన పేర్కొన్న జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకా శం ఉన్నందున మధ్యాహ్నం 3:30 గంటల నుండి రాత్రి 10:30 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయి.

ప్రత్యామ్నాయ మార్గాలు...ట్రాఫిక్ మళ్లింపులు...

అఫ్జల్‌గంజ్ నుండి ఎం.జె.మార్కెట్ వైపు వెళ్లే వాహనాలను అఫ్జల్‌గంజ్ టిజంక్షన్ వద్ద సెంట్రల్ లైబ్రరీ వైపు మళ్లించబడింది. ఊరేగిం పు ఎస్.ఎ.బజార్ మసీదును దాటుతున్న సమ యంలో, ఎం.జె. మార్కెట్ నుండి అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లే వాహనాలను ఎం.జె.మార్కెట్ వద్ద మలకుంట, అలాస్కా,ఛత్రి,ఎం.జె. బ్రిడ్జ్ వైపు మళ్లించడమైనది. ఊరేగింపు ఛత్రిని దాటుతున్న సమయంలో, ఎం.జె. బ్రిడ్జ్ నుండి ఛత్రి వైపు వెళ్లే వాహనాలను ఎం.జె. బ్రిడ్జ్ వద్ద జుమ్మేరాత్ బజార్,డెంటల్ కాలేజీ వైపు మళ్లించడమైనది. 100 ఫీట్ల రోడ్డు, జియాగూడ,కార్వాన్ నుండి పురానాపూల్ దర్వాజా వైపు వచ్చే వాహనాలను పురానాపూల్ ఎక్స్ రోడ్ వద్ద జుమ్మేరాత్ బజార్ ,ఎం.జె. బ్రిడ్జ్ వైపు మళ్లించడమైనది. గాంధీ విగ్రహం నుండి పురానాపూల్ దర్వాజా వైపు వచ్చే వాహనాలను పురానాపూల్ ఎక్స్ రోడ్ వద్ద 100 ఫీట్ల రోడ్డు వైపు మళ్లించడమైనది. ప్ర యాణికులు తాజా ట్రాఫిక్ అప్‌డేట్స్ కోసం మా సోషల్ మీడియా వేదికలైన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఫేస్‌బుక్ పేజీ మరియు ట్విట్టర్ ఫాలో అవ్వాలని పోలీరులు కోరారు.అత్యవసర ప్రయా ణ సహాయం కోసం మా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కు కాల్ చేయవచ్చని, నగర పౌరులందరూ పైన పేర్కొన్న ట్రాఫిక్ రద్దీ మరియు మళ్లింపులను గమనించి, తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

మియాపూర్‌లో ఉరివేసుకుని నర్స్ ఆత్మహత్య

శేరిలింగంపల్లి, మార్చి 3 ప్రభాతవార్త

మృతురాలు సోనుబాయ్ (ఫైల్‌ఫోటో)

నగర శివార్లలోని మియాపూర్ పోలీస్‌స్టే షన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచే స్తున్న యువతి ఉరివేసుకుని ఆత్మహత్య కు పాల్పడింది. సంఘటనకు సంబందిం చి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా నారాయణ ఖేడ్‌కు చెందిన సోనుబాయ్ మియాపూర్‌లోని ఓ హాస్టల్ ఉంటూ స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో న ర్సుగా పనిచేస్తుంది. ఈ క్రమంలోనే గత ఏడాదిగా కాలంలో ఒక యువకుడితో ప్రేమలో ఉన్న ఆమె ఆకస్మాత్తుగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని సీలింగ్‌కు ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. మియాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో నర్సు గా పనిచేస్తున్న క్రమంలో ఓ యువకుడితో ప్రేమలో పడిన మేఘా వత్ సోను బాయ్ (20) తన ప్రేమ విఫలంకావడంతోనే ఆత్మహత్య కు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఆమె సోదరుడు ఫిర్యాదు మేరకు సంఘటనాస్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో విభేదాలు..

గచ్చిబౌలిలో వివాహిత ఆత్మహత్య

గచ్చిబౌలి, మార్చి 3 ప్రభాతవార్త



మృతురాలు గంగ(ఫైల్‌ఫోటో)

భార్య,భర్తల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా కొన్ని నెలలుగా పుట్టింటిలో ఉంటున్న ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరా లు పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రం ఈస్ట్‌గోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన నీలం వీరబాబు తన కుటుంబంతో కలిసి గత సంవత్సర కాలంగా గచ్చిబౌలి టిఎన్ జీఓ కాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరబాబు స్థానికంగా వాచ్ మెన్‌గా పనిచేస్తుండగా, వీరి కుమార్తె గంట గంగ(28)ను 2018లో పెద్దాపురంకి చెందిన సుబ్రమణ్యంకు ఇచ్చి వివాహం చేశాడు. కాగా వీరికి సంతానం కలుగకపోవడం, భార్య,భర్తల మధ్య విభేదాలతో గంగ గత 5నెలలుగా టిఎన్‌జిఓ కాలనీలో గల తండ్రి వీరబాబు ఇంట్లోనే ఉంటుంది. కాగా ఈనెల 1వ తేదీన కుటుంబ సభ్యులు వారి పనుల్లో ఉండగా, గంగ బాత్‌రూమ్‌కు వెళ్లి బొద్దింకలు చంపేం దుకు ఉపయోగించే పురుగుల మందు తాగింది. బయటకు వచ్చి వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు గంగను వెంటనే కొండాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈమేరకు మృ తురాలి తండ్రి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసు కున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంతా నకిలీ..

-టీ పొడి, సర్ఫ్ పౌడర్, గుడ్‌నైట్ రీఫిల్స్

-గుజరాత్ నుంచి తెచ్చి హైదరాబాద్‌లో అమ్మకం

-ముగ్గురు రాజస్థానీ వ్యక్తులను అరెస్ట్ చేసిన సిసిఎస్ పోలీసులు



పోలీసులు స్వాధీనం చేస్తుకున్న నలిలీ టీపొడర్, సర్ఫ్‌ఫ్యాకేట్లు

హైదరాబాద్, మార్చి 3,,ప్రభాతవార్త:

మార్కెట్ అంతా నకిలీ మయంగా మారిపోయింది. బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ వస్తువుల తయారీకి అడ్డు అదుపులేకుండా పోతుంది. ఈనేపథ్యంలో ఇలాం టి నకిలీగాళ్లను గుర్తించేందుకు హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో నకిలీ టీపొడి, సర్ఫ్‌పొడర్, గుడ్‌నైట్ రీఫిల్ విక్రయిస్తు న్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. రాజస్థాన్ అజ్మీర్ జిల్లాకు చెందిన జయ రామ్ (30) నాగౌర్ జిల్లాకు చెందిన కచ్చవా సురేందర్ (34), బార్మార్ జిల్లాకు హను మాన్ రామ్ (21) దగ్గరనుండి 1340 రెడ్ లేబుల్ ప్యాకెట్లు , 100 తాజ్ మహా ల్ ప్యాకెట్లు , 75 కిలోల లూజ్ టీ పొడర్, 950 నకిలీ బ్రైడ్ ప్యాకెట్లు, 100 నకిలీ ఏరియల్ ప్యాకెట్లు, 300 వీల్ ప్యాకెట్లు, 550 సర్ఫ్ ఎక్సెల్ ప్యాకెట్లు. మస్కిటో రీఫిల్స్ గుడ్‌నైట్ లిక్విడ్ 3600 బాటిళ్లు (45 మి.లీ) లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గుజరాత్‌లోని డీలర్ల నుండి తక్కువ నాణ్యత గల మెటీరియల్‌తో పాటు నకిలీ ప్యాకింగ్ కవర్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని అసలైన బ్రాండెడ్ వస్తువులుగా నమ్మించి గోషామహల్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్ ,ఇతర ప్రాంతాల్లోని స్థానిక రిటైల్ హోల్‌సేల్ వ్యాపారులకు విక్ర యిస్తూ ప్రజలను మోసగిస్తున్నటున గుర్తించారు. ఈసందర్భంగా నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని వస్తు వుపై ఉన్న కోడ్‌లను తనిఖీ చేయడం ద్వారా అవి అసలైనవో కాదో ధృవీకరించుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

అటు ఎండలు... ఇటు జ్వరాలు

-ఉష్ణోగ్రతలతో పాటే పెరుగుతున్న వైరల్ ఫీవర్స్

-తలనొప్పి, కండరాల నొప్పి ..నాలుకతడి ఆరిపోవడం

-డయేరియా,వాంతులు లక్షణాలతో బాట

-ప్రభుత్వ ,ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెరుగుతున్న బాధితులు

-బయట తిరిగేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

హైదరాబాద్,మార్చి 3,ప్రభాతవార్త:

ఎండలు ప్రజల్ని అల్లాడిస్తున్నాయి. ఉన్నట్టుండి ఉ ష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఎటు చూసినా వైరల్ జ్వరాల బాధితులు కనిపిస్తున్నారు. వాంతులు, విరే చనాలు, ఒళ్లునొప్పుల వంటి లక్షణాలతో సతమత మవుతున్నారు. ఒక్కో క్లినికల్ వద్ద 50మందికి పైగా జ్వరపీడితులు ఉంటున్నట్లు తెలుపుతున్నారు. ఫీవర్ ఆస్పత్రికి కూడా కొద్దిరోజులుగా ఔట్ పేషెం ట్ (ఓపి) కూడా పెరుగుతుంది. కార్పొరేట్ ,ప్రైవేట్ ఆస్పత్రులల్లో ఒకేసారి కనీసం అయిదారుగురు బాధితుల్ని చూస్తున్నామని చెబుతున్నారు. కండరా లు పట్టేయడం, సొమ్మసిల్లడం, నీరసించిపోవడం, చెమటలు పట్టడం, నాలుకతడి ఆరిపోవడం, వాం తులు, వీరేచనాలు కళ్లతిరగడం ,తలనొప్పి తదిత ర లక్షణాలు వీరిలో ప్రధానంగా కనిపిస్తుంన్నాయని చెబుతున్నారు. ఎండలో ఎక్కువగా తిరిగేవారు ము ఖ్యంగా ద్విచక్రవాహనాలపై తిరిగేవారు జ్వరాల బా రినపడే ముప్పు ఉందని వారు వివరించారు. అ లాగే పరిశుభ్రమైన నీరు తాగకపోతే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లే అనేది వైద్యుల మాట. ప్రధానం గా హోటళ్లు, చాట్ దుకాణాలు, బస్సు స్టేషన్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద ఏనీరు పడితే ఆఆనీరు తాగడం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆహారం వి షయంలోనూ ఆరోగ్యకరమైన పదార్థాల్ని మాత్రమే తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

ఇలా చేయండి ..

ఎక్కువగా ఇంట్లో తయారు చేసే పండ్ల రసాలు తీసుకోవాలి. నీరు గ్లూకోజ్ ,జావ ,బార్లీ ,మజ్జిగ, రాగి అంబలి, సగ్గుబియ్యంతో చేసిన పానియాలు తీసుకోవడం మంచిది. నీటి శాతం కోల్పోతున్న వారు తాగే నీరులో ఉప్పు, పంచదార వేసుకని తాగాలి. ఉదయం 8గంటలకే బయటకు వెళ్లాలి. సాయంత్రం 6గంటల తర్వాత బయటి పనులు పూర్తి చేసుకోవాలి. ఎండల్లో తిరిగేవారు తప్పనిసరి గా గొడుగులు, టోపీలు ధరించాలి. వాంతులు ,విరేచనాలు అవుతున్నప్పటికీ ఎక్కువగా నీరు తాగి స్తూనే ఉండాలి. రోడ్లపక్కన విక్రయించే ఆహారం తినకూడదు. అపరిశుభ్రమైన నీరు తాగకపోవడం మంచింది. మాంసం, గుడ్లు , నూనె పదార్థాల జోలికి వెళ్లకూడదు. వేడిగా, తాజాగా ఉండే ఆహారం తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి..

ప్రధానంగా ఎండ వేడిమి, కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధులు వస్తాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులు రా కుండా చూసుకోవచ్చు. నివారణకు వైద్యులు సహాల ను పాటించాలి. వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గ కుండా జాగ్రత్తపడాలి. రోడ్ల పక్కన లభించే అపరి శుభ్ర ఆహార పదార్థాలను తినొద్దు. జలుబు ,తు మ్ము లు , ఒళ్లునొప్పులతో మొదలయ్యే జ్వరం,. నా లుగై దు రోజులపాటు ఇబ్బంది పెడుతుంది. మరీ ఎక్కువ గా ఉంటే వైద్యులని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

చంద్రగ్రహణంతో దేవాలయాలు, షాపులు మూసివేత

చంద్ర గ్రహణం సందర్భంగా మూసి వేసిన చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరం



చంద్రగ్రహణం సందర్భంగా మూసి వేసిన గుల్జారహౌస్‌లోని బంగారం దుకాణాలు

చార్మినార్,మార్చి 3 ప్రభాతవార్త :

చంద్ర గ్రహణం సందర్భంగా మంగళవారం పాత బస్తీలోని దేవాలయాలనుమూసి వేశారు.చంద్ర గ్రహణం ఏర్పడటంతో చార్మినార్,పటేల్ మార్కెట్, ఉర్దూగల్లీ,కోకరివాడి, షక్కర్‌కోట,ఘాన్సీ బజార్,బండి అడ్డ,చార్‌కమాన్,కాలీకమాన్, శాలిబండ,బహదూర్‌ప ుర,దూద్‌బౌలితో పాటు పలు ప్రాంతాలలోని హిం దూ వ్యాపారులు తమ దుకాణాలు మూసి వేసి చంద్ర గ్రహణం నియమాలను పాటించారు. చార్మి నార్‌శ్రీ భాగ్యలక్ష్మీ,చార్మినార్ శ్రీ మహదేవ్ మంది రం,చార్‌కమాన్ శివాలయం,చార్‌కమాన్ శ్రీ బాలాజి మందిరం,పాతనగరంలోని అన్ని దేవాలయాలను చంద్ర గ్రహణం సందర్భంగా తెరవలేదు.కాగా ఘా న్సీ బజార్, చార్‌కమాన్, శాలిబండ,కోకరివాడి,షక్కర్ కోటలో ఉన్న బంగారం,వెండి ఆభరణాలను షాపు లను మంగళవారం మధ్యాహ్నం రెండున్నర గంట లకు మూసి వేశారు.అదే విధంగా బెంగాలీలు ఎక్కు వగా ఉన్న ఘాన్సీ బజార్‌లో బంగారు ఆభరణాలు తయారు చేసే దుకాణాలు సైతం తెరవ లేదు. వస్త్రాల వ్యాపారానికి ఎంతగానో ప్రసిద్ధి గాంచిన పటేల్ మార్కెట్,రికాబ్‌గంజ్,బిజె మార్కెట్,ఆర్‌జె మార్కెట్,గోపాల మార్కెట్లలోని వందలాది వస్త్రాల షాపులు మంగళవారం ఏర్పడిన చంద్ర గ్రహణం సందర్భంగా వస్త్రాల వ్యాపారులు మూసి వేశారు. పాతబస్తీలోని వస్త్రాలు,బంగారం,వెండి షాపులు తెరవక పోవటంతో మార్కెట్లు నిర్మానుష్యంగా కనిపించాయి.

పాతనగరంలోని ప్రజలు అత్యవసర పరిస్థితులలో మాత్రమే బయటకు వచ్చారు.ఇండ్లలో ఉండి చంద్ర గ్రహణం నియమాలు పాటించారు.

విద్యార్థులే నవభారత నిర్మాతలు

- హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రతిభా పురస్కార గ్రహీత విద్యార్థులతో బండారు దత్తాత్రేయ, అశ్వినిసుబ్బారావు, సాధన నరసింహాచార్య తదితర అతిథులు

నాంపల్లి, మార్చి 3 ప్రభాతవార్త : సమాజంలో విద్య ప్రతీఒక్కరికీ ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా విద్యాబుద్ధులు నేర్పించాలని, విద్యార్థులే నవభారత నిర్మాతలని హర్యానా రాష్ట్ర మాజీ గవర్నరు బండారు దత్తాత్రేయ అన్నారు. అందరికీ విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై, విద్యపై వెచ్చించే మొత్తం ఖర్చుగా పరిగణించకూడదని ఆయన అన్నారు. భారత్ వికాస పరిషత్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్మన్ అశ్వినీ సుబ్బారావు సభాధ్యక్షతన వివిధ పాఠశాలలో ప్రతిభావంతులైన 6 నుండి 10వ తరగతి హైస్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దత్తాత్రేయ విశిష్ట అతిథి సిహెచ్.హనుమంతరావు, డా. అన్నదానం సుబ్రహ్మణ్యం, రాజేశ్వరరావు, సాధన నరసింహాచార్య, నరేంద్రకృష్ణ తదితరులతో కలిసి సుమారు 225 మంది హైస్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, పలువురుకి ప్రోత్సాహక బహుమతులు ప్రదానంచేసి శుభాశీస్సులందజేశారు. విద్యార్థులు కష్టపడి అకుంఠితదీక్షతో విద్యనభ్యసించి దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదిగి దేశ సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దత్తాత్రేయ హితవు పలికారు.

అంధ విద్యార్థులు ఎందులోనూ తీసిపోరు

అంధ విద్యార్థికి బ్రెయిలీ పరికరాన్ని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, జయచందర్లు

చాంద్రాయణగుట్ట, మార్చి 3, ప్రభాతవార్త : అంధ విద్యార్థులు ఎందులోను తీసిపోరని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని డాట్ రెయిజ్ ఫౌండేషన్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ వ్యవస్థాపకులు కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ డీసీఈబి కార్యదర్శి జయచందర్‌తో కలిసి దారుల్ షిఫా ప్రభుత్వ బాలుర అంధుల ప్రాథమిక పాఠశాల విద్యార్థి శ్రీయాంశ్‌రెడ్డికి లెఫ్ట్ టూ రైట్ ఆపరేటర్ బ్రెయిలీ పరికరాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బ్రెయిలీ ఆవిష్కరించిన పరికరంతో అంధ విద్యార్థులకు చదవటం, రాయటం సులభమైయ్యిందన్నారు. సాంప్రదాయ స్లేట్, స్టైలస్ పద్ధతిలో కుడి నుండి ఎడమకు వ్రాయాల్సి ఉండగా, ఈ పరికరంతో ఎడమ నుండి కుడికి నేరుగా రాయవచ్చన్నారు. కాగితం పైభాగంలోనే ఎత్తుగా బ్రెయిల్ బొట్లు తయారై వెంటనే చదవచ్చని తెలిపారు. ఇది పెర్కిన్ బ్రైలర్ విధానంతో సమానమన్నారు. విద్యార్థుల ఉన్నతికి ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీసీఈబి కార్యదర్శి జయచందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు మిలిహా తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన ఇళ్ల పట్టాలు వెంటనే పేదలకు అందించాలి

-ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బాధితులు

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన స్వామి వివేకానందనగర్ బస్తీవాసులు

చిక్కడపల్లి, మార్చి 3, ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ పరిధిలోని స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు వెంటనే అందజేయాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ విజ్ఞప్తిచేసారు. ఈమేరకు మంగళవారం బస్తీవాసులతో కలిసి మంత్రి క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో వినయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంజూరైన పేదల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీపై చర్చించారు. సానుకూలంగాస్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్‌తో ఫోన్ ద్వారా పట్టాల పంపిణీ అంశంపై చర్చించినట్లు తెలిపారు. వారం రోజుల్లో అధికారుల సమక్షంలో తామే స్వయంగా బాధితులకు ఇళ్ల పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చినట్లు వినయ్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు ఎం.బి. కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రత, సామాజిక అవగాహన వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

-ఎంపి డా.లక్ష్మణ్



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి డా.లక్ష్మణ్

చిక్కడపల్లి, మార్చి 3, ప్రభాతవార్త: నగరంలోని ఓడియన్ మాల్‌లో ది కేరళ స్టోరీ చిత్ర ప్రత్యేకప్రదర్శన మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరయ్యారు. ప్రముఖులతో కలిసి ఆయన సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా ఈచిత్రాన్ని తెరకెక్కించారని పేర్కొన్నారు. దేశభద్రత, సామాజిక అవగాహన వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, బిజెపి ఓబిసి మోర్చా కార్యవర్గసభ్యుడు పూస రాజు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్‌కుమార్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చాతిరి పార్థసారథి, బిజెవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, బొల్లంపల్లి రామ్‌రెడ్డి, శక్తి, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రస్తుత సామాజిక పరిణామాలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై వారు చర్చించారు. బాధ్యతాయుతమైన పౌరులుగా దేశహితం కోసం అందరూ ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

హోలీ వేడుకలలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హోళీ సంబరాల్లో పాల్గొన్న జంపనప్రతాప్ తదితరులు

రంగులలో చిన్నారులు

హోలీ వేడుకల్లో వి.టీమ్ అధ్యక్షులు దేవరింటి మస్తాన్‌రెడ్డి

ఛత్రినాకలో హోలీ ఆడుతున్న కుటుంబసభ్యులు

హోలీ వేడుకలలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే...

హైదరాబాద్, మార్చి 3, ప్రభాతవార్త: హోళీ పండుగ ప్రజలందరి జీవితాలలో ఆనందం నింపాలని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆకాంక్షించారు. మంగళవారం హోళీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సిబ్బందితో ఆయన కుటుంబసమేతంగా వేడుకలలో పాల్గొని, హోళీ శుభాకాంక్షలు తెలియచేశారు.

బోయిన్‌పల్లిలో...

కంటోన్మెంట్, మార్చి 3, ప్రభాతవార్త: హోళీ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం బోయిన్‌పల్లి ప్లేగ్రౌండ్ వద్ద నిర్వహించిన హోళీ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోళీ ఆడుకున్నారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ సాయిబాబాయాదవ్, కరన్ సింగ్, సురేశ్, యాదగిరి, బండి శ్రీనివాస్, పవన్, శ్రీకాంత్, శశి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో...

అల్వాల్, మార్చి 3, ప్రభాతవార్త: అల్వాల్‌లో హోళీ పండుగ సందర్భంగా చిన్నా పెద్దా రంగులలో తడిసారు. స్నేహితులు బైక్‌లుపై సవారీ చేస్తూ ప్రజలకు హోళీ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను పురస్కరించుకుని వ్యాపార సముదాయాలు దాదాపుగా మూసి ఉండడంతో రోడ్లు ఖాళీగా కనిపించాయి. పట్టణ పరిధిలో ఎటువంటి అసాంఘిక ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పండుగ ముగిసింది.

వివేకానంద్‌నగర్ కాలనీలో...

యూసుఫ్‌గూడ, మార్చి 3, ప్రభాతవార్త: గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద్‌నగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వి.టీమ్ అధ్యక్షులు దేవరింటి మస్తాన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హోళీ వేడుకలను జరుపుకున్నారు. అందరి జీవితాలూ రంగులమయంగా ఉండాలని మస్తాన్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో వి.టీమ్ ప్రధానకార్యదర్శి రవిందర్‌ముదిరాజ్, చెల్లయ్య, ఆదినారాయణ, సతీష్‌రెడ్డి, పవన్‌కుమార్, సత్యనారాయణ, బొంతు రవి, మల్లేష్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో...

-గుట్టపై మాసిక చండీహోమం

చాంద్రాయణగుట్ట, మార్చి 3, ప్రభాతవార్త: పాతబస్తీ వ్యాప్తంగా హోళీ సంబరాలు అంబరాన్నంటాయి. లింగ, వయోభేదం లేకుండా పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా రంగులు చల్లుకున్నారు. వీధుల్లో నృత్యాలు చేస్తూ ఆనందంగా చిందేశారు. బస్తీలు, రోడ్లు ఇంద్రధనస్సును తలపించాయి. చాంద్రాయణగుట్ట, ఛత్రినాక, ఉప్పుగూడ, గౌలిపురా, శాలిబండ, హరిబౌలి, లాల్‌దర్వాజా, అలియాబాద్, ఫలక్‌నుమా, జంగమ్మెట్ తదితర ప్రాంతాలలో పిల్లలు, యువతీయువకులు సంప్రదాయ, సింథటిక్ రంగులు, కోడిగుడ్లు పట్టుకొని వాహనాలపై సంచరిస్తూ సందడిచేశారు. దీంతో పాతబస్తీలోని పలు ప్రాంతాలలో పండుగశోభ ఉట్టిపడింది. అయితే చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నానికి రంగుల పండుగకు బ్రేక్ పడింది. పిల్లలు, యువత, పెద్దలు గ్రహణశూల కారణంగా ఇళ్ళకే పరిమితమయ్యారు. రోడ్లన్నీ బోసిపోయాయి. ఆలయాలు 24 గంటల పాటు మూతపడ్డాయి. బుధవారం ఆలయ సంప్రోక్షణ, ప్రత్యేక పూజల తరువాత భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. ఇక మద్యం దుకాణాలు పగలంతా మూసివేశారు. చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన శ్రీభ్రమరాంబాదేవి సమేత చెన్న మల్లికార్జునస్వామి దేవాలయంలో ఉదయం మాసిక చండీ హోమం ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో యజ్ఞక్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు.

ప్రధాన ఆలయాలు మూసివేత

చిక్కడపల్లి, మార్చి 3, ప్రభాతవార్త: చంద్రగ్రహణాన్ని (కేతుగ్రస్త గ్రస్తోదయ చంద్రగ్రహణం) పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలోని పలు ప్రధాన ఆలయాలను మంగళవారం మూసివేశారు. గ్రహణకాలంలో ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం భక్తుల దర్శనాలను నిలిపివేసి, అనంతరం శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుస్తారు. చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, చిలుకూరు బాలాజీ ఆలయం, బిర్లా మందిర్, బల్కంపేట ఎల్లమ్మ ఆలయం, ఉజ్జయినీ మహాకాళి ఆలయం (సికింద్రాబాద్), గణపతి ఆలయం (సికింద్రాబాద్), ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ శ్రీలక్ష్మీగణపతి ఆలయం, వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం, తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు మూసివేయబడ్డాయి. గ్రహణం ముగిసిన అనంతరం శాస్త్రోక్త పద్ధతుల్లో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి, తదుపరి భక్తులకు దర్శనాలను పునఃప్రారంభించనున్నట్లు ఆలయవర్గాలు వెల్లడించాయి. భక్తులు ఆలయాల పునఃప్రారంభ సమయాలను గమనించి దర్శనానికి రావాలని ఆలయ నిర్వాహకులు సూచించారు.

చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం మూసివేసిన దృశ్యం

సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు

అత్తాపూర్ మార్చి 3, ప్రభాతవార్త: ఉద్యోగులకు చట్టబద్ధత కల్పించినందుకు సిఎం రేవంత్ రెడ్డికి మాదిగ ఉద్యోగులందరూ కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం రాజేంద్రనగర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సన్మాన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మాదిగ ఎంప్లాయిస్ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో వ్యవసాయ ఉద్యాన మరియు పశు వైద్య విద్యాలయాల అధ్యాపకులు మరియు వ్యవసాయ ఉద్యాన మరియు పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి దేశంలోనే మొట్టమొదటిగా చట్టబద్ధత కల్పించినందుకు మాదిగ ఉద్యోగులందరూ హైటెక్ సిటిలోని శిల్పకళా వేదికలో సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ ఉద్యోగులు అందరూ భారీగా తరలివచ్చి ఈ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ బి విద్యాసాగర్ ప్రొఫెసర్ అండ్ హెచ్ ఓ డి, డాక్టర్ జి.మనోజ్‌కుమార్ వ్యవసాయశాఖ నుండి టి. రాజారత్నం డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ వికారాబాద్, తులసిరామ్ వ్యవసాయ అధికారి మరియు పశు వైద్య విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ ఆర్.ఎస్ ప్రసన్నకుమార్ విశ్రాంత ప్రొఫెసర్, డాక్టర్ కే.వెంకటరమణ, ప్రొఫెసర్ డాక్టర్ ఎంవి గోపాల్ కృష్ణ, డాక్టర్ ఏ.సుధీర్ బాబు, డాక్టర్ సంపత్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాజేష్‌బాబు, పశుసంవర్ధక శాఖ నుండి డాక్టర్ నాగయ్య అండ్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఒకే విధమైన ఫ్లోర్ వేజ్ ప్రకటించాలి

-భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షులు ఎస్.మల్లేశం

కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షులు ఎస్.మల్లేశం

చిక్కడపల్లి, మార్చి 3, ప్రభాతవార్త: భారతీయ మజ్దూర్ సంఘ్‌కు అనుబంధమైన మహారాష్ట్ర విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం 6వ త్రైవార్షిక మహాసభ మంగళవారం ప్రారంభమయ్యాయి. పుణేలో జరిగిన ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బిఎంఎస్ కార్యాలయం విడుదలచేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2300మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈమహాసభను భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షులు ఎస్.మల్లేశం ప్రారంభించారు. సభకు స్వాగతాధ్యక్షురాలిగా రాజ్యసభ సభ్యురాలు మేధాకులకర్ణి హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా మహావితరణ డైరెక్టర్ (మానవవనరులు) రాజేంద్రపవార్ పాల్గొన్నారు. సభను ఉద్దేశించి ఎస్.మల్లేశం మాట్లాడుతూ దేశంలోని కార్మిక వర్గం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్‌లలో వేజ్‌కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్‌లను స్వాగతిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేవిధమైన మినిమమ్ ఫ్లోర్‌వేజ్ ప్రకటించాలని, పెన్షన్ నిధిని పెంచాలని, అలాగే ఈఎస్ఐసి అర్హతపరిమితిని రూ. 21,000 నుండి రూ.42,000కు పెంచాలని డిమాండ్‌చేశారు. డిమాండ్ల సాధనకోసం ఫిబ్రవరి25న దేశవ్యాప్తంగా సర్కార్ జాగావ్ ఆందోళన నిర్వహించినట్లు తెలిపారు. మేధాకులకర్ణి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల శాశ్వతీ కరణకు సంబంధించిన న్యాయస్థాన తీర్పును స్వాగతిస్తున్నట్లు చెప్పారు. దాని సమర్థవంత మైన అమలుకై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి పరిపాలన తక్షణం చర్చలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రాజేంద్రపవార్ న్యాయస్థానతీర్పును సమగ్రంగా అధ్యయనం చేసి కార్మికులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది అనిల్ ధుమణే ప్రకటించిన ప్రకారం, హర్యానా ప్యాటర్న్ ఆధారంగా కాంట్రాక్టర్ రహిత ఉద్యోగ విధానాన్ని అమలుచేయాలని, అన్ని కాంట్రాక్ట్ కార్మికుల ను శాశ్వతసేవలో చేర్చాలని తీర్మానించారు. పెండింగ్ సమస్యల పరిష్కారార్థం ఏప్రిల్ 16, 2026న ముంబై బాంద్రాలోని శ్రమాయుక్త కార్యాలయం వద్ద భారీ ఆగ్రహర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. హర్యానా ప్యాటర్న్ ప్రకారం కాంట్రాక్టర్ రహిత ఉద్యోగవిధానం అమలుచేయాలి, అన్ని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వతసేవలో చేర్చాలి. విద్యుత్ రంగానికి ప్రత్యేకవేతన శ్రేణి అమలుచేయాలి. కనీసవేతనం కాకుండా జీవన వేతనం ఇవ్వాలి. ఈఎస్ఐసి అర్హతపరిమితిని రూ. 21,000నుండి రూ.42,000కు పెంచాలి. నూతన అధ్యక్షునిగా నీలేశ్ ఖరాత్, ప్రధాన కార్యదర్శిగా సచిన్ మెన్గాలే తిరిగి ఎన్నికయ్యారు.

సమాజంలో సేవాభావంతో ముందుకు రావాలి

-హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

పేద మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తున్న హర్యానా పూర్వగవర్నర్ బండారు దత్తాత్రేయ, చిత్రంలో బండారు విజయలక్ష్మి తదితరులు

చిక్కడపల్లి, మార్చి 3, ప్రభాతవార్త: సమాజంలో సేవా భావంతో ముందుకు రావాలని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బండారు వైష్ణవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాంనగర్‌లోని హరినగర్ ప్రాంతంలో పేద మహిళలకు కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమం ఫౌండేషన్ ఛైర్పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో దివంగత బండారు వైష్ణవ జయంతి సందర్భంగా జరిగింది. ముఖ్య అతిథిగా బండారు దత్తాత్రేయ హాజరై వీటిని పంపిణి చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు కుట్టు యంత్రాలను పంపిణీ చేసి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటును అందించారు. సమాజంలో సేవా భావంతో ముందుకు రావాలని దత్తాత్రేయ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, నవీన్ గౌడ్, రమేష్ రామ్, మాజీ కార్పొరేటర్ రవి చారి, పి. జైపాల్ రెడ్డి, వెంకటేష్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా గ్రామాభివృద్ధికి కృషి

షాబాద్, మార్చి 3, ప్రభాతవార్త : ప్రజలకు అనుగుణంగా గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని కొమరబండ సర్పంచ్ కుక్కల పద్మమ్మగోపాల్ అన్నారు. మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్వాక్రా మహిళల కోసం భవన నిర్మాణం పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు ప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అలాగే గ్రామంలో మౌలికవసతుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. దశలవారిగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నారమోని శేఖర్, పంచాయితీ కార్యదర్శి శంకర్, గ్రామస్తులు అంజయ్య, ధర్మబిక్షం, రమేష్ రాజు, బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

బోర్ రిపేర్ చేయించిన సాయిపేట శ్రీనివాస్

మేడ్చల్, మార్చి 3, ప్రభాతవార్త : గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని కండ్లకోయ గ్రామంలో గల స్మశాన వాటికలో మాజీ కౌన్సిలర్, గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ సొంత ఖర్చులతో బోర్ రిపేర్ చేయించాడు.స్మశాన వాటికలో నీటి సమస్య ఉన్న విషయం ఆయన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి సమస్య పరిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో ప్రజా సమ స్యలను తన దృష్టికి తీసుకువస్తే తన వంతు సహాయంగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు, పదవితో సంబందం లేకుండా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నాడు.

సంతోషంలో.. తోడునీడగా..!

ఎఫ్.సి.ఎన్ వృద్ధాశ్రమంలో తాంద్ర విశాల జన్మదిన వేడుకలు

షాద్‌నగర్, మార్చి 3, ప్రభాతవార్త: విధి వంచితులు, అనాథలు, అభాగ్యులను అక్కున చేర్చుకుని పండగ అయినా పబ్బమైన వారితోనే జరుపుకునే గొప్ప విశాల హృదయం కేశంపేట మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ మహిళా నేత తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డిది. ఎఫ్.సి.ఎన్ (ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్) వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి దంపతులు తమ చిరునవ్వుతో సేవ కార్యక్రమాలను చేపట్టారు. తన పుట్టినరోజును పురస్కరించుకొని అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించి వారి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. ఈ సంతోష సమయంలో వృద్ధులతో గడ పడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి దంపతులు మీడియాతో పేర్కొన్నారు. సమాజంలో ఎవరైనాసరే తమ వివాహ వార్షికోత్సవాలు జన్మదినోత్సవాలు ఇంకా అనేక శుభకార్యాలు ఇలాంటివారితో జరుపుకుంటే ఎంతోమందికి ఆదర్శం అవు తారని ఆమె సూచించారు. సంతోష సమయంలోనే అభాగ్యులకు తోడునీడగా అండగా నిలవాలని ఆమె పేర్కొన్నారు.

వేడుకగా కామదహనం

కామదహనం కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మార్చి 3, ప్రభాతవార్త: చిక్కడపల్లిలో మంగళవారం రాత్రి కామ దహనం కార్యక్రమం స్థానిక మాజీ కార్పొరేటర్, నగర టిడిపి ప్రధాన కార్యదర్శి పలుస బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కులాలు చదువుకుని పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్‌నగర్ డివిజన్ టిడిపి అధ్యక్షుడు డి.చంద్రమోహన్‌గౌడ్, రమేశ్, శివకృష్ణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుస బాలరాజ్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కట్టెలతో పేర్చిన కాముడిని దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా కామదహనాన్ని జరుపుకుంటామని, ప్రజలందరూ ఈ హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య, ప్రకృతి సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, బస్తీ వాసులు మరియు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కమిషనర్..!

షాద్‌నగర్, మార్చి 3, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్. అజయ్ కుమార్, తనిఖీ చేశారు రోగుల వార్డులలో ఉన్న వారిని వైద్యం ఎలా అందుతుందని అడిగి వివరాలు తెలుసుకున్నారు ఆసుపత్రి వార్డులతోపాటు పోస్టుమార్టం గదిని కూడా పరిశీలించారు. వైద్య సిబ్బంది నిరక్ష్యంగా వ్యవహరించకుండా ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని సూచించారు.

మాదిగలకు కాంగ్రెస్ రాజ్యసభ ఇవ్వాల్సిందే..

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటన్నోళ్ల నరసింహ మాదిగ డిమాండ్

షాద్‌నగర్, మార్చి 3, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి త్వరలో భర్తీ కాబోతున్న రాజ్యసభ స్థానాలలో కాంగ్రెస్ మాదిగలకు ఒక స్థానం ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటన్నోళ్ల నరసింహ మాదిగ డిమాండ్ చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కటికెట్ కూడా ఇవ్వకుండా, అయితే ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక్కఅవకాశం కూడా ఇవ్వకుండా మాదిగలకు అన్యాయం చేశారని అన్నారు. ఇప్పటికైనా రాజ్యసభలో అవకాశం ఇచ్చి అన్యాయాన్ని సరిదిద్దుకోవాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం నుండి మాదిగలకు పార్లమెంట్లో రాజకీయ ప్రాతినిథ్యం లేకుండా కుట్రలు చేస్తుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి పార్లమెంట్లో ఓసీలకు బీసీలకు ఎస్టీలకు ప్రాధాన్యత ఉందని, ఎస్సీలలో మాలలకు మాత్రమే అవకాశం ఉందని అన్నారు. మాదిగ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నాడని అనుకోవాలంటూ గొప్పలుచెప్పుకున్న రేవంత్ రెడ్డి ఆచరణలోమాత్రం మాదిగజాతిపై సవతిప్రేమను చూపెడుతున్నాడని అన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. మాదిగలకు అవకాశం ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి కాలంలో మాదిగలకు ఏకకాలంలో రాజ్యసభలోను, లోక్‌సభలోను అవకాశం ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. లోక్‌సభలో మంద జగన్నాథం, సిరిసిల్ల రాజయ్య ,రాజ్యసభలో నంది ఎల్లయ్య ఉండేవారని గుర్తు చేశారు. తెలుగుదేశం హయాంలో కూడా తెలంగాణ నుంచి ఇద్దరు మాదిగల లోక్‌సభలో ఉన్నారన్నారు. వీటన్నిటినీ గుర్తించి ఈసారి కచ్చితంగా మాదిగలకు అవకాశం కల్పించాలని, లేదంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కెసిఆర్‌ను కలిసిన మన్నె గోవర్ధన్‌రెడ్డి

కేసీఆర్‌కు పుష్ప గుచ్ఛాలు అందిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి.

జూబ్లీహిల్స్, మార్చి 3, ప్రభాతవార్త: బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్‌రెడ్డి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలను అందించారు. నియోజకవర్గంలో పార్టీ చాలా బలంగా ఉందని కేసీఆర్ దృష్టికి మన్నె గోవర్ధన్‌రెడ్డి తీసుకెళ్లారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై తాము చేస్తున్న పోరాటాన్ని, ఆందోళన వివరాలను కేసీఆర్‌కు వివరించినట్లు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై మరింత పోరాటం చేసి న్యాయం జరిగేలా చూడాలని కేసీఆర్ సూచించినట్లు మన్నె గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై తమ పోరు ఆగదని ఆయన మంగళవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ముస్లిం మైనార్టీ మహిళలు

కంటోన్మెంట్, మార్చి 3 ప్రభాతవార్త: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఆర్థికంగా అభివృద్ధి చెంది కోటీశ్వరులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 200 కుట్టు మిషన్లు ఇటీవల మంజూరు చేయించి ఉచితంగా అందజేసి నందుకు మంగళవారం బోయిన్‌పల్లి కడక్‌పుర పెన్షన్ లైన్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఉద్యేశమన్నారు.

ప్రజావసరాలు మేరకు అభివృద్ధి : మాజీ కార్పొరేటర్

కాలనీ వాసులుతో మాజీ కార్పొరేటర్

అల్వాల్, మార్చి 3 ప్రభాతవార్త: ప్రజావసరాలు మేరకు అభివృద్ధి కొనసాగిస్తామని ఇందుకు ప్రజలు సహకరించాలని మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. మంగళవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని వెంకన్న కాలనీలో 39 లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న అంతర్గత సిసి రోడ్లు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ ప్రారంభించారు. కాలనీలోని పార్కును అభివృద్ధి చేస్తామని జితేందర్‌నాథ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, స్వామి, లడ్డు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఫతేనగర్ శివాలయంలో అట్టుకల్ పొంగాల్ మహోత్సవం

- పాల్గొన్న బిజెపి సీనియర్ నాయకుడు కంచి మహేందర్

అట్టుకల్ పొంగాలా మహోత్సవంలో పాల్గొన్న కంచి మహేందర్

మూసాపేట్, మార్చి 3, ప్రభాతవార్త

నగరంలోని ఫతేనగర్ శివాలయంలో అట్టుకల్ పొంగాలా మహోత్సవం మంగళవారం భక్తి శ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. కేరళలో ఆవిర్భవించిన ఈ పవిత్ర ఉత్సవం అట్టుకల్ పొంగాలాగా ప్రపంచవ్యాప్తంగా విశేష ఖ్యాతిని పొందింది. మహిళలంతా అత్యధిక సమూహంగా ఒకేచోట చేరి నిర్వహించే ధార్మిక వేడుకగా ఇది గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందడం విశేషం. ఈ సందర్భంగా స్థానిక మహిళా భక్తులు సంప్రదాయబద్ధంగా పొంగాల వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. భక్తుల జపాలు, మంగళవాద్యాల నాదంతో ఉత్సవం భక్తిరసభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇటువంటి సాంప్రదాయ ఉత్సవాలు భారతీయ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబిస్తాయని, మన సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రన్, కార్యదర్శి జైన్, సభ్యుడు రేజీ తదితరులు ఏర్పాట్లను సమర్థంగా పర్యవేక్షించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

ప్రేమ,ఆనందాల కలయికతో హోలీ : ఎమ్మెల్యే తలసాని

హోలీ సంబరాల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట,మార్చి3 ప్రభాతవార్త: ప్రేమ,ఆనందాల కలయిక హోలీ పండుగని హోలీ అని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని మోండా డివిజన్ బండి మెట్‌లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగులు ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేత నాగులు ఎమ్మెల్యే తలసానికి రంగులు పూసి శాలువాతో ఘనంగా సత్కరించి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ వసంత రుతువులో వచ్చే హోలీ పండుగను హిరణ్యా కశివుడును నర్సింహ్మా స్వామి సంహరించిన చిహ్నంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఓదెల సత్య నారాయణ, అశోక్,అమర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు బండరాళ్లతో అటంకం

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, మార్చి 3 ప్రభాతవార్త: మేడిబావి ప్రాంతంలో గత కొంతకాలంగా నిత్యం డ్రైనేజీ సమస్యలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి రావడం వల్ల రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే ఉద్దేశంతో రూ. 23 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులతో పాటు పాత లైన్ విస్తరణ పనులను కొన్ని రోజుల కిందట (అప్పటి కార్పొరేటర్) మాజీ కార్పొరేటర్ ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. డ్రైనేజీ లైన్ ఏర్పాటు కోసం తవ్వకాలు చేపడుతున్న సమయంలో జ్యోతి మోడల్ స్కూల్ సమీపంలో పెద్ద బండరాయి బయటపడింది. ఈ కారణంగా పనులకు అంతరాయం ఏర్పడింది. ఇంజనీరింగ్ నిపుణులతో సంప్రదించి ప్రత్యేక యంత్రాలతో ఆ బండరాయిని తొలగించే చర్యలు ప్రారంభించారు.

సమస్యను పరిశీలించిన మాజీ కార్పొరేటర్....

మేడిబావిలో రూ. 23లక్షలతో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతుండడంతో స్థానికులు మాజీ కార్పొరేటర్ సామలహేమ దృష్టికి తీసుకువచ్చారు. ఆమే మంగళవారం పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ... ఇక్కడి డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసమే పైప్‌లైన్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన తర్వాత డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్య పూర్తిగా పరిష్కారం కానుందన్నారు. మురుగునీటి పారుదల సక్రమంగా జరిగి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత మెరుగుపడుతుందన్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి పనులు త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మాజీ కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ తెలిపారు.

పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదు : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

పర్వత్‌నగర్‌లో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

యూసుఫ్‌గూడ, మార్చి 3, ప్రభాతవార్త : పేద ప్రజల జోలికి వస్తే ఎంత వాటిరనైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ బస్తీలో కొంత భాగం ప్రైవేట్ వ్యక్తులు ఆ స్థలం తమదే అంటూ వచ్చి స్థానికంగా ఉన్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో స్థానిక బస్తీ అధ్యక్షులు జాహేద్ షరీఫ్ విషయాన్ని ఎమ్మెల్యే కృష్ణారావు మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ దృష్టికి తీసుకువెళ్లగా వారు బస్తీలో పర్యటించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పర్వత్ నగర్ వాసులకు జీవో 58 కింద పట్టాలు ఇవ్వడం జరిగిందని, 59 జీవో కింద రెగ్యులరైజేషన్ చేయటం జరిగిందని అయితే ఇప్పుడు కొందరు ప్రైవేట్ వ్యక్తులు వచ్చి ఆ స్థలం తమకు చెందిందని అక్కడ నివసిస్తున్న ప్రజలను బెదిరిస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితిల్లోనూ మీరు భయపడాల్సిన అవసరం లేదని మిమ్మల్ని అందరినీ మేము కాపాడుకుంటాం మీకు అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డీ గౌసుద్దీన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయలయ్య, జాహేద్ షరీఫ్, నాగుల సత్యం, మొగలి రాజు, లక్ష్మణ్, కళ్యాణ్ నాయక్, భద్రు నాయక్,శంకర్ గంగపుత్ర,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

చంద్ర గ్రహణం సందర్భంగా ఉజ్జయినీ మహకాళీ దేవస్థానం మూసివేత

శ్రీఉజ్జయినీ మహకాళీ అమ్మ వారి ఆలయాన్ని మూసివేస్తున్న దృశ్యం.

బేగంపేట, మార్చి 3,ప్రభాతవార్త

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహకాళీ అమ్మ వారి ఆలయాన్ని మంగళవారం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం గం 8లకు మూసివేసారు.బుధవారం ఉదయం గం 8.30నిలకు ఆలయ శుద్ధి అనంతరం మహ మంగళ హారతి నిర్వహించి ఆలయం తెరిచి భక్తులకు అమ్మ వారి దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.

కంటోన్మెంట్ బోర్డుకు రూ.14.55 కోట్లు నిధులు మంజూరు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బోర్డు మెంబర్ బానుక నర్మధ

కంటోన్మెంట్,మార్చి 3 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు 2025. .26 సంవత్సరానికి గాను రూ.14.55 కోట్లు నిధులు మంజూ చేసినట్లు కంటోన్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సికింద్రాబాద్ కంటోన్మెంట్ మెంబర్ బానుక నర్మధ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దేశంలోని 48 కంటోన్మెంట్ బోర్డులకు రూ.221 కోట్లు నిధులు మంజూరు కాగా అందులో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు 55 కోట్లు మంజూరైనట్లు అమె తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలను మరింత అభివృద్ధి పర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

జూపార్కులో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం

జూపార్కును సందర్శించిన కోరుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 3 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో మంగళవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జూపార్కు క్యూ రేటర్ జె.వసంత మాట్లాడుతూ జూపార్కులో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహించామని తెలిపారు.క్లీనప్ డ్రైవ్,బర్డ్ వాక్,యానిమల్ కీపర్స్ టాక్ షోలు,పాములపై అవగాహనతో పాటు విద్యా కార్యక్రమాలను నిర్వహించామని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు.ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట,మార్చి 3 ప్రభాతవార్త: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని బ్లూసీ హోటల్ ఎదురుగా ఉన్న రైల్వే మజ్దూర్ యూనియన్ గేట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.సుబ్బరావ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 2వ తేదీన రైల్వే మజ్దూర్ యూనియన్ గేట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. విషయాన్ని గమనించిన పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శవాన్ని గాంధీ మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే గోపాలపురం పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ సంఘాలు ప్రజలకు అధికారులకు వారధిగా నిలవాలి : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

రాజీవ్‌గాంధీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా గెలుపొందిన ఆనంద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్.

యూసుఫ్‌గూడ, మార్చి 3, ప్రభాతవార్త : బస్తీల కాలనీల సంక్షేమ సంఘాలు ప్రజలకు, అధికారులకు సమస్యల పరిష్కారంలో వారధిగా నిలవాలని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్, రాజీవ్‌గాంధీనగర్ బస్తీలో ఇటీవల జరిగిన సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఆనంద్ గెలవడంతో మర్యాదపూర్వకంగా స్థానిక శాసన సభ్యులు నవీన్ యాదవ్‌ను కలిశారు. అందుకు ఆయన సంక్షేమ సంఘం అధ్యక్షునితో పాటు మద్దతు దారులను ప్రత్యేకంగా అభినందిస్తూ బస్తీ అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్రాల బాలరాజు, పెయింటర్ చెన్నయ్య, రాయుడు, మూర్తి, మాషయ్య, వడ్డె వెంకటేష్, నరేందర్, వసంత్ పాల్గొన్నారు.

ప్రకాశ్‌గౌడ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయి

- ప్రేమ్‌గౌడ్‌పై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు

నార్సింగి, మార్చి 3 ప్రభాతవార్త : వరుసగా నాలుగు మార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రజా నాయకుడు ప్రకాశ్ గౌడ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్‌లు బిఆర్ఎస్ నాయకుడు ప్రేమ్ గౌడ్‌ను హెచ్చరించారు. మూడు రోజుల క్రితం హైదర్షా కోట్ డివిజన్‌కు వచ్చిన కేటీఆర్ సమావేశంలో బిఆర్ఎస్ నేత ప్రేమ్‌గౌడ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై పలు ఆరోపణలు, విమర్శలు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయనపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్ధరాత్రి ఇంటి తలుపు కొట్టినా స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే అండతోనే రాజకీయంగా ఎదిగిన నీవు ఆయననే విమర్శిస్తావా? స్థాయి మరిచి మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. నిత్యం ఎమ్మెల్యే కాళ్లు మొక్కి, ఆయన పేరు చెప్పుకొని ఊరిపై పడి భారీగా వసూళ్లు చేసుకున్న నీవు ఇప్పుడు ఆయననే విమర్శిస్తావా? వెంటనే ఎమ్మెల్యేకు క్షమాపణలు చెప్పాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మీరు సర్పంచ్‌గా ఉన్నప్పుడు ఎన్ని అరాచకాలు చేశారో అన్నీ ప్రజలకు తెలుసన్నారు. రాజేంద్రనగర్ పిఎస్‌లో రౌడీషీటర్ ఉంటే ఎమ్మెల్యే కాళ్లమొక్కి అది తీయించుకొని, ఇప్పుడు తొడలు గొడ్తావా? అని ప్రశ్నించారు. మనకు రాజకీయ బిక్ష పెట్టి, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించిన వారి పట్ల విధేయతగా ఉండాలని, ఇలా వీధి రౌడీలా మాట్లాడడం తగదని సూచించారు. ఇలాగే వ్యవహరిస్తే వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

ఆరాంఘర్ వద్ద ఎండిఎం డ్రగ్స్ స్వాధీనం

అత్తాపూర్ మార్చి 3, ,ప్రభాతవార్త : డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల ఎండిఎం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వివరాలో కి వెళితే .. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ కళాశాల ప్రధాన ద్వారం ముందున్న జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకుండా గుర్తు తెలియని వ్యక్తు నిషేధిత మత్తు పదార్థాలను తరలిస్తున్న హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులుక విశ్వసనీయ వర్గాల ద్వారా పక్కా సమాచారం అందింది. దాంతో సర్వీసు రోడ్డులోని మెట్రో క్లాసిక్ గార్డెన్‌విజయ్ ఆయిల్ కంపనీ రోడ్డు వద్ద మాటు వేశారు. సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో అటుగా వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 150 గ్రాముల ఎండిఎంను పోలీసులు గుర్తించారు. దాంతో ఎండిఎం రవాణ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అధుపులోకి తీసుకున్న పోలీసులు ఆ ముఠా వివరాలు సేకరించేందుకు దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించలేదు.

శిరస్త్రాణం.. ప్రాణాధారం

- వాహనదారులకు హెల్మెట్లు అందించిన ఎసిపి హరిప్రసాద్

వాహనదారుడికి శిరస్త్రాణం అందిస్తున్న యంగ్ ఇండియా ప్రతినిధులు, ఎసిపి కట్టా హరిప్రసాద్.

జూబ్లీహిల్స్, మార్చి 3, ప్రభాతవార్త: శిరస్త్రాణం వాహనదారులకు ప్రాణాధారమని జూబ్లీహిల్స్ జోన్ ఎసిపి కట్టా హరిప్రసాద్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో మంగళవారం ఆయన యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సహకారంతో శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి శిరస్త్రాణాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీదైన వాహనాలు కొనుగోలు చేస్తున్న వాహనదారులు శిరస్త్రాణం ధరించకుండా ప్రయాణిస్తున్నారు. చాలా మేర రోడ్డు ప్రమాద సంఘటనల్లో శిరస్త్రాణాలు ధరించకపోవడం వల్లనే ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడటం జరుగుతుందన్నారు. ఈ కారణంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణాలు ధరించాలని, తద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు. మరోవైపు డ్రైవింగ్ లైసెన్సులపై సైతం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా లైసెన్స్, సరైన పత్రాలు లేని వాహనదారులను గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కోరణి సునీల్, ఎస్సైలు నర్సింహారావు, గోపి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 50 మందికిపైగా ఇక్కడ శిరస్త్రాణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పూర్ణిమా సరాఫ్, రాహుల్ శ్యాంశుక్లా, ఆకాశ్ తపాడియా తదితరులు పాల్గొన్నారు.

రోడ్లంతా మురుగు పరుగు

-గల్లీల్లో నిలిచిన డ్రైనేజీ నీటితో స్థానికుల ఇబ్బందులు

-నెలన్నర రోజులైనా పట్టించుకోని అధికారులు

గుండ్ల నర్సింహస్వామి ఆలయం గల్లీలో నిల్చిపోయిన మురుగు

ఇళ్ల ముందు నిల్చి పోయిన డ్రైనేజీ నీరు.

బేగంపేట మార్చి 3,ప్రభాతవార్త

బేగంపేట ప్రకాశం నగర్ గుండ్ల నర్సింహస్వామి దేవాలయం గల్లీలో నెలన్నర రోజులుగా డ్రైనేజీ నీరు తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ పొంగి పొర్లుతున్నా సంబంధిత శాఖాధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.ఈ మార్గంలో పొంగుతున్న డ్రైనేజీ నీటి కారణంగాఇళ్ల లో నుంచి బయటకు రాలేకపోతున్నామన్నారు. అలాగే గుండ్ల నర్సింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.మురుగు ప్రవాహంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయని తెలిపారు. కాలనీలోని 6లైన్లు మురుగు నీటితో నిండిపోవడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉందని,తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని వారు వాపోతున్నారు.చిన్నారులు పాఠశాలలకు వెళ్లాలన్నా మురుగులో నుంచే వెళ్లాల్సి వస్తుందని తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కొందరు ఈ నీటిలోనే ఇళ్లలోని చెత్తను సైతం పడవేస్తుండటంతో మరింత దుర్వాసన వెదజల్లుతుందన్నారు.ఈ గల్లీకి సమీపంలో కూకట్‌పల్లి నాలా కూడా ఉండటంతో దోమలు,ఈగలు,ఇతర కీటకాలు పెద్ద సంఖ్యలో ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇటీవల సిబ్బంది వచ్చి తాత్కాలికంగా పనులు చేసి వెళ్లారని, వారు సమస్యను పరిష్కరించకుండా వెళ్లిపోయారని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఈ వీధులలో తరచూ ఈ సమస్య తలెత్తుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చేయకపోవడంతోనే తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపించారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్విత పరిష్కారం చూపాలి : జాండ్ల కృష్ణ

ప్రకాశం నగర్ పరిధిలోని గుండ్ల నర్సింహస్వామి దేవాలయం గల్లీలో నిత్యం డ్రైనేజీ నీరు రోడ్లపై నిల్చిపోయి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని,రోజుల తరబడిగా మురుగు నీరు రోడ్లపై నిల్చి ఉండటంతో గల్లీ దుర్వాసన వెదజల్లుతుందని స్థానికుడు జాండ్ల కృష్ణ ఆరోపించారు.6గల్లీలో పెద్ద ఎత్తున డ్రైనేజీ నీరు నిల్చిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని,దోమలు అధికంగా వస్తున్నాయని,ఈ సమస్యకు శాశ్విత పరిష్కారం చూపాలని కృష్ణ కోరారు.లేదంటే స్థానికులతో కల్సి పెద్ద ఎత్తున వాటర్ వర్క్స్ సీవరేజ్ కార్యాలయం ముందు ఆందోళణ సైతం చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఉత్సాహంగా కాముని దహనం

అత్తాపూర్ మార్చి 3, ప్రభాతవార్త : చెడుపై మంచి గెలుపు సంకేతంగా ముందు రోజు కామ దహనం ఉత్సాహంగా నిర్వహిస్తారని కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ పేర్కొన్నారు.కాటేదాన్ డివిజన్ లో హోలీ వేడుకలు అత్యంత సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా స్థానిక ప్రజలందరూ ఏకమై కామ దహనంకార్యక్రమాన్ని నిర్వహించారు.అగ్ని దేవుడికి పూజలు నిర్వహించి, రంగులు పూసుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ...హోలీ పండుగ ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో శర్మ జి , ఠాకూర్ , అంబా దాస్ , కిరణదుకాణం అంబాదాస్, సునీత , మోను , స్థానిక నాయకులు, యువకులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ఫాలోవర్ల కోసం తప్పుడు పోస్టులు

- నటిపై పోస్టు పెట్టిన కేసులో నిందితుడు అరెస్ట్

జూబ్లీహిల్స్, మార్చి 3, ప్రభాతవార్త: ప్రముక సినీనటిపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా కామెంట్లు పెట్టిన నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు జూనియర్ ఆర్టిస్ట్ కావడం, తనకు సోషల్ మీడియాలో ఫాలోవర్లు పెరగాలని ఈ పని చేసినట్లు పోలీసులు గుర్తించారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రముక సినీనటి ఇన్‌స్టాలో పెట్టిన ఒక పోస్టు కింద రీల్‌మాయ1 పేరుతో ఒకరు అసభ్యకరమైన పోస్టును పెట్టాడు. దీంతో నటి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా రీల్‌మాయ1 ఖాతా వివరాలను సాంకేతికత ఆధారంగా గుర్తించారు. ఈ నకిలీ ఖాతా ద్వారా వరంగల్ జిల్లాకు చెంది బంజారాహిల్స్ ప్రాంతంలో నివసించే రుషిత్ పోస్టు పెట్టినట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకొన్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా సోషల్ మీడియాలో ఫాలోవర్లు పెరగడానికి, తాను ప్రాచుర్యం పొందడానికి పోస్టు పెట్టినట్లు ప్రాథమికంగా అంగీకరించాడు. పలు సినిమాల్లో రుషిత్ జూనియర్ ఆర్టిస్ట్‌గా సైతం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ హోంగార్డుపై దాడి కేసులో సినీ దర్శకుడి కుమారుడి అరెస్ట్

జూబ్లీహిల్స్, మార్చి 3, ప్రభాతవార్త: విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోంగార్డుపై దాడి కేసులో ఒక సినీ దర్శకుడు, రచయిత కుమారుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కాలనీలో నివసించే ప్రముక సినీ దర్శకుడు, రచయిత, ఎడిటర్ మణిశంకర్ కుమారుడు ప్రేమ్‌శంకర్ తన బ్యాటరీ కారులో ఆదివారం రాత్రి బంజారాహిల్స్ వైపు వచ్చాడు. బ్యాటరీ ఛార్జింగ్ అయిపోవడంతో వాహనం రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో అక్కడే ఉన్న ట్రాఫిక్ హోంగార్డు మన్యం కారు తీయమని చెప్పడానికి వెళ్లగా ప్రేమ్‌శంకర్ మద్యం సేవించినట్లు గుర్తించాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసేందుకు ప్రయత్నించగా నిరాకరించడంతో తోటి వాహనదారుల సాయంతో అతన్ని బలవంతంగా కారులో నుంచి బయటకు తీసుకొచ్చారు. అదే సమయంలో హోంగార్డుపై చేయి చేసుకోవడమే కాకుండా ప్రేమ్‌శంకర్ అక్కడి నుంచి కారు వదిలి పరారయ్యాడు. ట్రాఫిక్ ఎస్సై రాంమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం అతన్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విడాకులు ఇవ్వడం లేదని భార్యపై కత్తితో దాడి

జూబ్లీహిల్స్, మార్చి 3, ప్రభాతవార్త: వివాహేతర సంబంధం నేపథ్యంలో విడాకులు ఇవ్వడం లేదని భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని నందినగర్‌లో నివసించే అడవన్న(45)కు పెళ్లై ముగ్గురు పిల్లలున్నారు. దాదాపు 17 ఏళ్ల క్రితం పెళ్లైన అతను ఇటీవల మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంలో ఇంట్లో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. కాగా 11 ఏళ్లకుపైగా వయసున్న ముగ్గురు పిల్లలున్న తండ్రి భార్యను విడాకులు ఇవ్వాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. విడాకులు ఇవ్వనని భార్య చెప్పడంతో కోపగించుకున్న అడవన్న ఇంట్లోని కూరగాయల కత్తితో ఆమెపై దాడికి పాల్పడగా ఆమెకు గాయలయ్యాయి. బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యాయత్నం కింద నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-V ADDL., JUDICIAL MAGISTRATE, MEDCHAL MALKAJGIRI COURTS, UPPAL AT MEDIPALLY
O.S.No. 435 of 2022
Between:
Canara Bank, Nagole Branch, Medchal-Malkajgiri, ...Plaintiff
And
M/s Srinidhi Silks ...Defendant
To
M/s Srinidhi Silks, Represented by its Sole Proprietor Smt Chavali Sudha W/o V. Subramanyam, aged about 29 years, Occ: Business, R/o H.No.2-2-1119/3, Flat No.9, 2nd Floor, Sundaram Mansion, New Nallakunta, Hyderabad-500044 PH NO: 6309405003.
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.10,26,266/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **12th March, 2026, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
N. Venugopala Rao
Advocate
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
Cell No: 9849264568

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE: MEDCHAL COURT :: AT MEDCHAL.
E.P.NO. 41 OF 2021
IN
AA/CF/No. 150 OF 2018
Between:-
M/s.Margadarsi Chit Fund Pvt Ltd., Balanagar Branch. ...Decree Holder.
And
Mr.P.Ajay & Others.. ...Judgment Debtors.
To
Mr.M.Anthony, S/o.M.M.James, R/o.H.No.24-489/2, Ranga Reddy Nagar, IDPL Colony, Chintal, Medchal.
..J.D.No.02.
Please take notice that the above EP is filed against you for recovery of Rs.2,75,442/- (Rupees Two Lakhs Seventy Five Thousand Four Hundred And Forty Two Only) and the same is posted to 11th day of March, 2026 for your appearance in the court at 10.30 A.M. If you fail to attend the court on that day the matter will be heard and decided exparte.
// BY ORDER OF THE COURT //
B.MAHESH BABU,
ADVOCATE,
PLOT NO.147,
HAKIMPET,
SHAMIRPET MANDAL,
MEDCHAL DISTRICT.

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

-సినియర్ న్యాయవాది రాపోలు భాస్కర్

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ తదితరులు.

మలక్ పేట, మార్చ్ 3, ప్రభాతవార్త: పదవ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు భారీ ప్రోత్సాహకాలను ప్రకటించారని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ తెలిపారు. గడ్డి అన్నారం కళ్యాణ్ నగర్ లోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులతో కలిసి ప్రోత్సాహకాల బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షల ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల్లో రాష్ట్ర టాపర్లుగా నిలిచే విద్యార్థికి ఐదు లక్షల నగదు, రెండవ స్థానం పొందిన విద్యార్థికి మూడు లక్షలు, ప్రతి జిల్లా టాపర్ కు రెండు లక్షలు, 119 నియోజకవర్గాలలో ప్రతి నియోజకవర్గ టాపర్‌కు ఒక లక్ష, 612 మండలాలలో ప్రథమ స్థానం పొందే ప్రతి విద్యార్థికి పదివేల రూపాయల నగదు బహుమానాలు అందిస్తారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం డిఎం కృష్ణారెడ్డి, దిల్ షుక్ నగర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి : రవికుమార్

ఓల్డ్ మలక్ పేట్ లో హోలీ వేడుకలను నిర్వహిస్తున్న శ్రీ పోచమ్మ దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట ,మార్చి 3, ప్రభాతవార్త:
పండుగలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ఓల్డ్ మలక్ పేట శ్రీ పోచమ్మ దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవి కుమార్ పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట లో చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి హోలీ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంతో మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత గురించి యువతకు అవగాహన కలుగుతుందన్నారు. రంగురంగుల హోలీ పండుగ ఐక్యత, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అందరూ కలిసిమెలిసి పండుగలను జరుపుకోవడంతో ప్రజల అందరి మధ్య ఐక్యత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ పోచమ్మ దేవాలయ చైర్మన్ బాబు శ్రీనివాస్, నాయకులు వేమూరి విజయకుమార్, తాటికొండ శ్యామ్ పాల్గొన్నారు.

టిఎన్‌జిఓ నేతను సన్మానించిన దుర్గానగర్ కాలనీ సంక్షేమ సంఘం

సత్యనారాయణ గౌడ్‌ను సన్మానిస్తున్న జగన్నాథ్‌రెడ్డి తదితరులు

సైదాబాద్, మార్చి 3 ప్రభాతవార్త: టిఎన్‌జిఓ సెంట్రల్ యూనియన్ కోశాధికారిగా ఎన్నికైన ముత్యాల సత్యనారాయణ గౌడ్‌ను చంపాపేట డివిజన్ దుర్గా నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగ జగన్నాథ్ రెడ్డి, కార్యదర్శి బూరం వెంకటేష్, సహాధ్యక్షులు పునరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సందీప్‌కుమార్, ఎస్.సతీష్‌కుమార్, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ఛీఫ్ అడ్వయిజర్ కె.యాదగిరిరెడ్డి, బి.శ్రీనివాస్ గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం ద్వారబంధనం

దేవాలయాన్ని ద్వారబంధనం చేస్తున్న సిబ్బంది, అర్చకులు, ధర్మకర్తలు

సైదాబాద్, మార్చి 3 ప్రభాతవార్త: మంగళవారం చంద్రగ్రహణం కారణంగా కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానాన్ని ఉదయం 9 గంటలకు ద్వారబంధనం చేశారు. బుధవారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ, 7 గంటలకు అభిషేకము అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించబడుతాయని దేవాలయ పాలకవర్గం ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, కార్యనిర్వాహణాధికారి లావణ్యలు తెలిపారు.

ఘనంగా సర్‌మౌంట్ స్కూల్ వార్షికోత్సవం వేడుకలు

ఉప్పల్‌లో జరిగిన సర్‌మౌంట్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి, విజయేందర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 3 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని సర్‌మౌంట్ స్కూల్ వార్షికోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ విజయేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ చైతన్య మురళి, శ్రావ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సర్‌మౌంట్ స్కూల్‌లో విద్యార్థులకు అన్ని రకాల బోధన నిర్వహిస్తున్నారని తెలిపారు. పాఠశాల పిల్లల యొక్క సృజనాత్మకతను ప్రోత్సహించే పాఠశాల నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నాయని తెలిపారు. విద్య ప్రతి ఒక్కరికి నాణ్యమైన మానవీయ విలువలను పెంపొందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్‌మౌంట్ స్కూల్ ఎక్సలెన్స్ కరస్పాండెంట్ విజయేందర్ రెడ్డి, శ్రావ్య, చైతన్య మురళి, బి.ధన్ సాగర్, సల్ల ప్రభాకర్ రెడ్డి, రాజు, శ్రీనివాస్ సందీప్, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలోనే రైతులకు పాల బిల్లులు : చైర్మన్ మధుసూదన్ రెడ్డి

-ఎన్డీడీబీ ఒప్పందంపై చర్చ... రైతుల అంగీకారం

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

హాజరైన సొసైటీ సభ్యులు

హయత్ నగర్, మార్చి 3 ప్రభాతవార్త :
పాడి రైతులు, ఉద్యోగుల సంక్షేమం కోసం ఎన్డీడీబీతో ఒప్పందం తప్పనిసరి అని నార్ముల్ మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి అన్నారు. పాల బిల్లుల కోసం సర్వసభ్య సమావేశం ఏర్పాటుకు 234 మంది సొసైటీ చైర్మన్లు ఎండీ కి నోటీసులు ఇవ్వగా... మంగళవారం హయత్ నగర్లో నిర్వహించిన సమావేశంలో సభ్యుల మధ్య రసవత్తర చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ గుత్తా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఆడిట్ నివేదికలు, చిట్యాల భూ కొనుగోలులో ఎలాంటి అవకతవకలు జరుగలేదన్నారు. బ్యాంక్ రుణాల కోసమే లాభాలు చూపామన్నారు. పాల బిల్లుల కోసం సర్వ సభ్య సమావేశం నిర్వహించడం సిగ్గుచేటన్నారు. అవగాహన లోపాలు, అనుభవ లేమితో పాలన కొనసాగించడం నష్టాలకు కారణమన్నారు. ఎన్డీడీబీతో ఒప్పందం సంస్థకు నష్టం కలిగిస్తుందన్నారు. పలువురు సొసైటీ చైర్మన్లు మాట్లాడుతూ... ఐదున్నర నెలలుగా పాలబిల్లులు చెల్లించలేదని రాజకీయాలను పక్కన పెట్టి వెంటనే పాలబిల్లులు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో అందరు రాజీనామా చేయాలన్నారు. చైర్మన్ స్పందించకుంటే ఇంటిని ముట్టడిస్తామన్నారు. సంస్థ చైర్మన్లు, పాలక వర్గ సభ్యులు, అధికారుల అక్రమ ఆస్తులపై విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. ఛైర్మన్ ను రైతులే నేరుగా ఎన్నుకునేలా బైలాను మార్చాలన్నారు. సభ్యుల ప్రశ్నలకు చైర్మన్ సమాధానమిస్తూ... 201516 వరకు లాభాల్లో ఉన్న సంస్థ క్రమంగా నష్టాల పాలవడానికి కారణం ఎవరని ప్రశ్నించారు. అవినీతి పై తాను ఎక్కడినా ప్రమానానికి సిద్ధమని, మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎన్డీడీబీ తో ఒప్పందంలో ఎలాంటి దాపరికం లేదని... ఒప్పదం చేసుకున్న వెంటనే రైతుల పాల బిల్లుల కోసం 10 కోట్లు చెల్లించడానికి ఎన్డీడీబీ అంగీకరించినట్లు ఛైర్మన్ తెలిపారు. రైతులకు మేలు జరిగేలా ఉంటే ఎన్ డీ డీ బీ తో ఒప్పందం తమకు అంగీకారమే నన్నారు. చైర్మన్ సూచన మేరకు సంస్థ ప్రతినిధి సామ మహిపాల్ రెడ్డి ఒప్పందం తాలుక పత్రాల్లోని వివరాలను సమావేశంలో చదివి వినిపించారు. పాడి రైతులు బయపడాల్సి నది ఏమి లేదని మార్చి నెలాఖరుకు ఒప్పందం పూర్తవుతుందని ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ కాటిపల్లి లింగారెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి : ఉప్పల

మహిళా దినోత్సవానికి హాజరైన ప్రముఖులు

ఎమ్మెల్సీ వాణిదేవిని సన్మానిస్తున్న ఉప్పల స్వప్నశ్రీనివాస్‌గుప్తా

ఎల్.బి.నగర్, మార్చి 3 ప్రభాతవార్త: దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆధ్వర్యంలో నాగోల్ శుభం కన్వెన్షన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు మున్సిపల్ ఎన్నికల్లో మేయర్, డిప్యూటీమేయర్, చైర్మెన్, కౌన్సిలర్‌గా అవకాశం కల్పించాడన్నారు. ఎన్నో యేండ్ల ఆకాంక్ష ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళా శక్తి దేశాభివృద్ధికి మూలస్తంభమని అన్నారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వానిదేవి మాట్లాడుతూ వంటింటికే పరిమితమవుతున్న మహిళలు నేడు విద్య, ఉద్యోగాలు, వ్యాపార రంగాలు, రాజకీయాలు, సాంకేతిక రంగాలలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలు, రుణసదుపాయాలు, స్వయంఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాట పోటీలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా అయిదుగురు మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళిగుప్త, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత, సినీ నటుడు మాజీమంత్రి బాబుమోహన్, సినీనటులు కవిత, ఇన్స్పెక్టర్ మక్బూల్‌జానీ, కరాటే కళ్యాణి, బిజెపి నాయకులు చికోటి ప్రవీణ్, మాజీ కార్పొరేటర్లు చెరుకు సంగీతప్రశాంత్ గౌడ్, పద్మనాయక్, ఐవిఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, చందా భాగ్యలక్ష్మి, మంజుల, కక్కిరాల రమేశ్, పబ్బ చంద్రశేఖర్‌గుప్త, కట్ట రవిగుప్త, నరేష్‌గుప్త పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేయూత : హరీష్‌రావు

ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్‌లు అందజేస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మార్చి 3 ప్రభాతవార్త : ఎంబీబీఎస్ విద్యార్థులకు చేయూత అందించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం బీఎల్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు వైద్య విద్యార్థులకు చెక్‌లు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఎంతో మంది వైద్య విద్యార్థులకు విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమన్నారు. కేవలం దానంతోనే కాకుండా భవిష్యత్‌లో ఆరోగ్య వ్యవస్థలో పెట్టుబడిగా బావించాల్సిన అంశమని తెలిపారు. వెనుక బడిన వర్గాల నుంచి ప్రతిభావంతులైన యువతను ప్రోత్సహిస్తూ ముందుకు సాగాలని కోరారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో సుమారు 122 మంది వైద్య విద్యార్థులకు వారి విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ దూరదృష్టి నాయకత్వంలో, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో వైద్య కళాశాలల స్థాపనతో కొత్త విప్లవం సాకారమైందని తెలిపారు. దీని ద్వారా వైద్య విద్య అవకాశాలు విస్తరించి, ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతం అయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి ,ప్రభుదాస్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, మహేష్ గౌడ్, వంజరీ ప్రవీణ్, పిల్లి నాగరాజు, బోసాని పవన్ కుమార్, దయాకర్ రెడ్డి, శ్రవణ్, రఘువరన్, నాని, రాజేష్ గౌడ్, కడిగే శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఊబకాయం-నిద్రలో శ్వాస ఆడకపోవడం సమస్యకు దంత వైద్యమే సమర్థ పరిష్కారం

-దవడ సమతుల్యత, కండరాల సడలింపుతో శ్వాసనాళ విస్తరణ సాధ్యం : డా. ఎస్. ఎస్. నారాయణ

నేరేడ్ మెట్, మార్చి 3ప్రభాతవార్త :
ప్రపంచ స్థూలకాయ దినోత్సవం సందర్భంగా ఊబకాయం వల్ల పెరుగుతున్న అవరోధిత నిద్ర శ్వాస అప్నియా (ఒబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా) సమస్యపై దంత వైద్య రంగం కీలక పాత్ర పోషిస్తున్నదని ప్రముఖ దంత వైద్య నిపుణుడు డా. ఎస్. ఎస్. నారాయణ (బీడీఎస్, పీజీడీఎంఎల్‌ఎస్) తెలిపారు. శరీరంలో అధిక కొవ్వు మెడ, గొంతు ప్రాంతాల్లో పేరుకుపోవడం వల్ల నిద్ర సమయంలో పై శ్వాసనాళం కుంచించుకుపోయి శ్వాస ఆడకపోవడం జరుగుతుందని ఆయన వివరించారు. కేవలం బరువు తగ్గించడం మాత్రమే పూర్తి పరిష్కారం కాదు. దవడ నిర్మాణం, పళ్ల అమరిక, కండరాల ఒత్తిడి కలిసి పై శ్వాసనాళ స్థిరత్వంపై ప్రభావం చూపుతాయి" అని డా. నారాయణ స్పష్టం చేశారు. రాత్రివేళ పళ్లను బిగించి రుద్దే అలవాటు (బ్రక్సిజం) కారణంగా దవడ కండరాలు అధికంగా పనిచేసి దీర్ఘకాలంలో దవడ వెనుకకు సడలిపోవడం, నాలుక వెనక్కి జరగడం జరుగుతుందని తెలిపారు. దీని వల్ల గొంతు మార్గం సన్నగిల్లి నిద్రలో శ్వాస ఆడకపోవడం తీవ్రమవుతుందని చెప్పారు. అధునాతన డిజిటల్ పరికరమైన టిస్కాన్ సాంకేతికత ద్వారా పళ్లపై పడే ఒత్తిడి, అసమాన స్పర్శలను ఖచ్చితంగా గుర్తించవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక డీప్రోగ్రామర్ పరికరాల సహాయంతో కండరాలను సడలించి సహజ దవడ స్థితిని పునరుద్ధరించడం ద్వారా శ్వాసనాళంపై ఒత్తిడి తగ్గించవచ్చని వివరించారు. నిద్ర పరీక్ష (పాలీ సోమనోగ్రఫీ) నివేదికల ఆధారంగా దవడను స్వల్పంగా ముందుకు తీసుకువచ్చే మాండిబ్యులర్ అడ్వాన్స్‌మెంట్ పరికరాలు (ఎంఏడీ) వినియోగించడం ద్వారా శ్వాసనాళం విస్తరించి రాత్రివేళ శ్వాస ఆడకపోవడం సమస్యను తగ్గించవచ్చని తెలిపారు. దవడ సమతుల్యతను పునరుద్ధరించడం, కండరాల సౌమ్యతను మెరుగుపరచడం వంటి దంత చికిత్సలు పై శ్వాసనాళ ప్రతిఘటనను తగ్గించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఊబకాయం-నిద్ర శ్వాస సమస్యకు సమగ్ర వైద్యం అవసరం. బరువు నియంత్రణతో పాటు చెవి- ముక్కు-గొంతు నిపుణులు, నిద్ర వైద్యులతో సమన్వయం చేసుకుంటే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. శరీర బరువు తగ్గించడం ఎంత ముఖ్యమో, దవడ సమతుల్యత- కండరాల సమన్వయం-శ్వాసనాళ స్థిరత్వాన్ని పునరుద్ధరించడం కూడా అంతే ముఖ్యం" అని డా. ఎస్. ఎస్. నారాయణ స్పష్టం చేశారు.

6 నుంచి శ్రీ భూలక్ష్మిదేవి రెండో వార్షికోత్సవ వేడుకలు

ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లో కొలువుదీరిన శ్రీ భూలక్ష్మి దేవి అమ్మవారు దృశ్యం.

వార్షికోత్సవ ఉత్సవాలకు ముస్తాబైన ఉప్పల్ భూలక్ష్మి దేవి ఆలయం దృశ్యం.

ఉప్పల్, మార్చి 3 ప్రభాతవార్త : ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లోని శ్రీ భూలక్ష్మి దేవి ఆలయం రెండో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటి అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు జాజుల నాగేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు గంధం సంపత్‌గౌడ్, వేముల దుర్గారెడ్డి, చలపతిరావు, రఘు, విజయ్ మోహన్ పలువురు ఆలయ కమిటి నేతల ఆధ్వర్యంలో ఉత్సవాలకు సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆలయం రెండో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 6వ తేదిన గణపతి పూజ, అంకురార్పణ, మండప ఆరాధన, అఖండ దీప స్థాపన, దీక్షా దారణ, అగ్ని ప్రతిష్ట, మహా మంగళ హారతి, మంత్ర పుష్ప, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈనెల 7వ తేదిన శనివారం ఉదయం గణపతి పూజ, మండప ఆరాధన, శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పంచామృత అభిషేకం, అలంకరణ దర్శనం, శ్రీ సూక్త మూల మంత్ర శ్రీ గణపతి పూజ, నవగ్రహ వాస్తు పూజ, యోగిని, క్షేత్రపాలక సర్వతోభద్ర, సుదర్శన శ్రీసూక్త మాల మంత్ర హోమాలు, శ్రీ లలితా సహస్ర నామ పారాయణం, బలి ప్రదానం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, మంత్ర పుష్పం, తీర్ద ప్రసాద వితరణ కలక ఉద్వాసన, ఆశ్వీరచనం ఉంటుందని తెలిపారు.

అదే రోజు సాయంత్రం పల్లకి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. దేవాలయం అర్చకులు వెంకటరమణ శర్మ కన్నయ్య పంతులు, రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

బాలాపూర్‌లో వీధి దీపాల సమస్యను పరిష్కరించాలి : బాల్‌నింగని జంగయ్య

బాలాపూర్ పాత గ్రామంలో వెలగని వీధి దీపాలు

సరూర్‌నగర్, మార్చి 3 ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని బాలాపూర్ డివిజన్-62లో పాత గ్రామం బాలాపూర్ స్థానిక హరిజన యువజన సంఘం ప్రధాన రోడ్డులో వీధి దీపాల సమస్యను తీర్చాలని టిపిసిసి ఎస్సీ సెల్ నాయకుడు, బడంగ్‌పేట్ పాత మున్సిపల్ కార్పొరేషన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ బాల్‌నింగని జంగయ్య డిప్యూటీ కమీషనర్‌ను కోరారు. గత వారం రోజుల నుండి వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ ప్రాంతంలో అంధకారం నెలకొంటున్నదనీ ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. స్థానిక ఎలక్ట్రిక్ సిబ్బంది ఈ సమస్యను పట్టించుకోవడం లేదనీ ఈ మేరకు తక్షణమే స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని జంగయ్య కోరారు.

ఉద్యోగ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు విజయవంతం

ముగింపు సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

సరూర్‌నగర్, మార్చి 3 ప్రభాతవార్త:
బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత వారం రోజుల పాటు నిర్వహించిన ఉద్యోగ నైపుణ్యాల శిక్షణా కార్యక్రమాలు విజయవంతంగా ముగిసాయి. రిలయన్స్ ఫౌండేషన్, మాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమాల సందర్భంగా కమ్యూనికేషన్స్ స్కిల్స్, బయోడేటా తయారీ, ఇంటర్వ్యూల పద్ధతులు, గ్రూపు చర్చలు, సమయ పాలన, వర్క్ ప్లేస్ ఎథిక్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమిష్టి కృషితో విజయవంతం చేసిన ఈ శిక్షణా కార్యక్రమాలు ముగింపు సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కెరీర్ గైడ్‌లైన్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

: మాజీ కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సిసి రోడ్డును పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, మార్చి 3 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్ శంకేశ్వర్ బజార్‌లో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి అవసరాలకు తగ్గట్లుగా స్థానికంగా నూతన యుజిడి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు నూతన రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. తన పదవీ కాలం పూర్తయినప్పటికీ డివిజన్ వాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వృద్ధునికి మాతృదేవోభవ ఆసరా

గాయంతో బాధపడుతూ దీనస్థితిలో ఉన్న గుర్తు తెలియని అనాథ వృద్ధుడిని చేరదీసి భోజనం పెట్టిన నాదర్‌గుల్ మాతృ దేవోభవ ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరి

సరూర్‌నగర్, మార్చి 3 ప్రభాతవార్త: వృద్ధాప్య అనారోగ్యాలకు తోడు మతిస్థిమితం లేక కాలికి తీవ్ర గాయంతో నడవలేని స్థితిలో దిక్కు తోచని పరిస్థితిలో బాలాపూర్ చౌరస్తాలో దీనంగా ఉన్న ఓ గుర్తు తెలియని వృద్ధునికి నాదర్‌గుల్ మాతృదేవోభవ ఆశ్రమం అండగా నిలిచింది. వృద్ధుని దయనీయ పరిస్థితిని గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరి వృద్ధుడిని అక్కున చేరదీశాడు. స్థానిక మీర్‌పేట్ పోలీసులకు సమాచారం ఇచ్చిన పిమ్మట ఆశ్రమ సిబ్బందితో బాధిత వృద్ధుడిని ఆశ్రమానికి తరలించి ప్రాథమిక వైద్య చికిత్సలు అందించారు. అనంతరం వృద్ధునికి భోజనం పెట్టి వసతి కల్పించారు. మతిస్థిమితం లేని అభాగ్యుల పట్ల మాతృదేవోభవ చూపుతున్న ఆదరణను స్థానికులు అభినందించారు. అయితే సంబంధిత వృద్ధుడిని గుర్తించిన వారు ఆశ్రమం సెల్ 9347 513830 కు సమాచారం ఇవ్వాలని గట్టు గిరి కోరారు.

ఆనందోత్సవాల మధ్య రంగోలి

హోలీ సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

ఎల్.బి.నగర్, మార్చి 3 ప్రభాతవార్త:
ఆనందోత్సాహాల మధ్య హోలీ పండుగ వేడుకలను జరుపుకున్నారు. అందమైన రంగులతో నిండిన హోలీ పండగ వెలుగు , ఆరోగ్యం, శాంతి, సంతోషం, ఐశ్వర్యం, విజయం, శ్రేయస్సును నింపాలని దేవుడిని వేడుకుంటూ భారత్ మాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయపురి కాలనీ ఫేస్ 2 లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా కొత్తపేట, చైతన్యపురి, ఆర్కే పురం, నాగోల్ డివిజన్ ప్రాంతాలలోని పలు కాలనీలలో పెద్దఎత్తున హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు రుద్దుకొని వేడుకలు జరుపుకున్నారు.

మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి

-కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, మార్చి 3 ప్రభాతవార్త: మహిళా దినోత్సవం సందర్భంగా జయచంద్రరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, నుకాల పద్మారెడ్డి సంయుక్తంగా తెలంగాణ ప్రగతిశీల మహిళా సమ్మేళనం మంగళవారం నాగోల్ పిఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కమలసుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు భారస అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు చెరుకు సంగీతప్రశాంత్‌గౌడ్, పద్మనాయక్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల స్వావలంబన, సాధికారత కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్నారన్నారు. మహిళ కుటుంబంలో సమాజంలో అన్ని రకాలుగా వివిధ స్థాయిల్లో తన పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఎబివిపి ఆధ్వర్యంలో హోలీ ఫెస్ట్

హోలీ ఫెస్ట్‌లో పాల్గొన్న బిజెపి నేత వల్లపు జగన్ యాదవ్ తదితరులు

రామంతాపూర్, మార్చి 3 ప్రభాతవార్త : ఎబివిపి ఆధ్వర్యంలో రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం హోలీ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి బుర్ర అఖిల్, భాను ప్రకాష్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాని బిజెపి సీనియర్ నేత వల్లపు జగన్‌యాదవ్, నాసు సతీష్ తదితరులు పాల్గొన్నారు. హోలీ వేడుకలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. యువతకు తన వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హోలీ సంబరాల్లో రాజస్థాన్ సమాజ్

మల్కాజ్గిరి, మార్చి 3,ప్రభాతవార్త :
హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని రాజస్థాన్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగుల సంబలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. సంప్రదాయ వేడుకలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీశ్ గౌడ్ పాల్గొని సభ్యులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఐక్యత, సౌహార్దత పెంపొందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుక్ రాజ్ చౌదరి, నారాయణ్ చౌదరి, కిషోర్ చౌదరి, ఎన్.ఆర్. చౌదరి, సొరుక్ చౌదరి, ప్రకాష్ చౌదరి తదితర ప్రముఖులు సతీసమేతంగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న సభ్యులు పరస్పరం రంగులు2 చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. సంప్రదాయ విందుతో కార్యక్రమం ముగిసింది.

కాలనీస్ అసోసియేషన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కామ దహనం

గాయత్రీనగర్‌లో కామునిదహనం చేస్తున్న దృశ్యం: చిత్రంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మార్చి 3 ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని పాత మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధికి సంబంధించిన కాలనీస్ అసోసియేషన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కామ దహనం కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లెలగూడ గాయత్రీ నగర్ క్రాస్ రోడ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న లైబ్రరీ బిల్డింగ్ వద్ద కాముని దహన కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు శాంతమూర్తి, కోశాధికారి నాగేశ్వరరావులతో పాటు ప్రేమ్ చంద్రారెడ్డి, హరిబాబు, సుధాకేశవ్, ఫణికిరణ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కామ దహనం అనంతరం ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి మాట్లాడుతూ చంద్ర గ్రహణం నేపథ్యంలో మంగళవారం హోలీ పండగను నిర్వహించడం లేదని అన్నారు. అయితే బుధవారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో లైబ్రరీ బిల్డింగ్ వద్ద హోలీ వేడుకలు నిర్వహిస్తామనీ ఈ మేరకు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జిహెచ్‌ఎంసిలో విలీన కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి : చిగిరింత నర్సింహారెడ్డి



స్థానిక కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి: చిత్రంలో పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, వల్లపు సుభాన్ యాదవ్ తదితరులు

సరూర్‌నగర్, మార్చి 3 ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసిలో విలీనం అయిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రాంతాల సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిగిరింత నర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్-57లో మంగళవారం ఆయన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ తదితరులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అయోధ్యనగర్, వివేకానందనగర్, సిద్ధార్థనగర్ తదితర కాలనీల్లో పాదయాత్రలు చేస్తూ పర్యటించిన ఆయన స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పలువురు డ్రైనేజీ, పార్కు స్థలాలు తదితర సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తీరుస్తామని తెలిపారు. అదే విధంగా పార్కు స్థలాలు కబ్జాకాకుండా సర్కిల్ ఆఫీసు తరపున బోర్డులు ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో అంకంగారి వెంకటేశ్‌గౌడ్, బంగారి అశోక్, గడ్డం మాధవరెడ్డి, లింగారెడ్డి, యాతం కుమార్ యాదవ్, మహేందర్ యాదవ్, బంగారి మురళి, శివ, నాగరాజు, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.